క్లుప్తంగా

16న వరద రాజస్వామి కల్యాణోత్సవం

ఆకివీడు: అత్యంత పురాతనమైన భూసమేత వరద రాజస్వామి వారి కల్యాణోత్సవం ఈ నెల 16వ తేదీన మండలంలోని దుంపగడప గ్రామంలోని ఆలయ ప్రాంగణంలో జరుగనుందని ఆలయ చైర్మన్ రామిశెట్టి సూరిబాబు మంగళవారం చెప్పారు. ఈ నెల 15వ తేదీ నుంచి ఆలయ ప్రాగణంలో అభిషేకాలు, స్వామి వారిని పెండ్లి కుమారుడ్ని, పెండ్లి కుమార్తెలను చేయడం వంటి కార్యక్రమాలు జరుగుతాయన్నారు. 16న కల్యాణోత్సవం, 17న మహాపూర్ణాహుతి, చక్రస్నానం జరుగుతాయన్నారు. ఆయా కార్యక్రమాల్ని ఆలయ అర్చకులు శ్రీనివాసుల ఫణి కృష్ణమాచార్యులు పర్యవేక్షణలో జరుగుతాయని చెప్పారు.

చురుగ్గా ఉపాధి హామీ పనులు



మర్రితిప్పలో పంట బోదెను తవ్వుతున్న కూలీలు

నరసాపురం రూరల్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులు ఊపందుకున్నాయి. మంగళవారం నరసాపురం మండలంలో 90 గ్రూపులకు చెందిన 2700 మంది 28 గ్రామాల్లో పనులు చేశారని ఎంపీడీఓ ఎం వెంకట రమణారావు తెలిపారు. ఉపాధి హామీ పనుల్లో భాగంగా కాలువలు, చెరువు తవ్వకం, పూడికతీత తదితర పనులు చురుగ్గా సాగుతున్నాయని చెప్పారు.

చురుగ్గా పంటబోదె తవ్వకం పనులు



మోడి గ్రామంలో పంటబోదె తవ్వుతున్న ఉపాధి కూలీలు

మొగల్తూరు: మండలంలోని పంట బోదె తవ్వకం పనులు చురుగ్గా సాగుతున్నాయి. కేపీ పాలెం నార్త్, సౌత్, పేరుపాలెం నార్త్, మొగల్తూరు పంచాయతీ నక్కావారిపేట, ఇంజేటివారిపాలెం, పడమటిపాలెం, నల్లంవారితోట, పాలకమ్మ చెరువు తదితర ప్రాంతాల్లో మంచి నీటి చెరువులకు తాగునీరందేలా పంట బోదెలు తవ్వుతున్నారు. మంగళవారం మండలంలోని మోడి గ్రామంలో సుమారు 3 కిలో మీటర్ల మేర పంటబోదె తవ్వకం పనులు చేపట్టారు. ఈ పనులను టీఏ వెంకటేశ్వరరావు, జేఈ ఆనంద్‌లు పర్యవేక్షించారు.

గడ్డిని తగలబెట్టడం భూమికి హానికరం



చేలల్లో ఎండుగడ్డిని తగులబెట్టిన దృశ్యం

నరసాపురం రూరల్: దాళ్వా వరి మాసూళ్ల అనంతరం రైతులు పంటచేలల్లో ఎండుగడ్డిని తగులబెట్టడం వల్ల భూమి పోషకాలను కోల్పోతుందని వ్యవసాయశాఖ ఏడీ ఈదా అనిల్‌కుమారి పేర్కొన్నారు. నరసాపురం మండలంలో సుమారు 12 వేల ఎకరాల్లో వరిసాగు చేస్తున్నారని, ప్రస్తుతం యంత్రాలతో వరికోతలు కోస్తున్నార తెలిపారు. చేలల్లో ఉండిపోయిన వరిగడ్డిని తగులబెట్టడం వల్ల భూమి పోషకాలు కోల్పోవడంతో పాటు, పర్యావరణ సమస్యలు తలెత్తే అవకాశం ఉందని పేర్కొన్నారు.

ఉండిలో విజయం మనదే

- పీవీఎల్ ధీమా
- సంక్షేమమే...బలం..బలగం



ఉండి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్

ఆకివీడు: ఈ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం దుందుభి మోగించనుంది. మళ్లీ రాష్ట్రంలో సంక్షేమ ప్రధాత జగన్ మళ్లీ సీఎం కాబోతున్నారని , అలాగే ఉండి నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ విజయం సాధిస్తుందని ఉండి ఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్ నర్సింహరాజు చెప్పారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ నియోజకవర్గంలో అత్యధిక శాతం ఓట్లు వేసిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఓటింగ్ సరళినిబట్టి మహిళలు, అవ్వాతాతలు,ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, అన్ని వర్గాల ప్రజలు అత్యధిక ఓట్లు ఫ్యాన్‌గుర్తుకు వేసినట్లు స్పష్టమవుతోందన్నారు. నియోజకవర్గంలో ప్రజలందరికీ అందుబాటులో ఉండి ఎనిమిదేళ్ల పాటు సేవలందించానని చెప్పారు. ప్రభుత్వ పథకాలు ప్రజలకు పారదర్శకంగా అందించే విధంగానూ, నాలుగు మండలాల్లోని అధికారులతో సామరస్య పూర్వకంగా పనిచేసి, నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేసినట్లు పీవీఎల్ చెప్పారు. రైతులు, మహిళలకు ఏ విధమైన సమస్య వచ్చినా తక్షణం పరిష్కరించానన్నారు. గత ఐదేళ్లుగా నియోజకవర్గ రైతాంగానికి నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకున్నానని, ధాన్యం కొనుగోలులో రైతులకు వెనువెంటనే సొమ్ము ఖాతాల్లో పడే విధంగా కృషి చేసినట్లు వివరించారు. నాలుగున్నర దశాబ్దాలుగా నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు చేయలేని పలు సమస్యల్ని పరిష్కరించి, నిరుపేదలకు ఇళ్ల స్థలాలు అందజేసి, ఇళ్లు నిర్మించిన ఘనత తనకే దక్కుతుందన్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ, గడప గడపకూ తిరిగి ప్రజా సమస్యలి తెలుసుకుని పరిష్కరించే తాను ప్రజలకు మరింత చేరువయ్యానని చెప్పారు. తాను పడిన కష్టానికి ప్రతిఫలంగా ప్రజలు తనకే అత్యధిక ఓట్లు వేసి శాసనసభకు పంపుతారన్న విశ్వాసం తనకు ఉందని పీవీఎల్ చెప్పారు. నియోజకవర్గంలో మొత్తం 2,24,725 మంది ఓటర్లుండగా మహిళలు 97,025 మంది, పురుషులు 96,695 మంది ఓటు హక్కు వినియోగించుకోగా మొత్తం 86.20 శాతం ఓట్లు పోలయ్యాయని చెప్పారు. అత్యధిక శాతం ఓట్లు పోలవ్వడంతో ప్రజలు ఉత్సాహంగా తనకే అధిక ఓట్లు వేశారన్న సంతోషం తనకుందని చెప్పారు. తనకు సహకరించిన ఓటరు దేవుళ్ళకు, వైఎస్సార్‌సీపీ కుటుంబ సభ్యులకు, శ్రేయోభిలాషులకు, అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. మీ రుణం తీర్చుకునేందుకు, నియోజకవర్గ అభివృద్ధికి జూన్ 4వ తేదీన అసెంబ్లీకి వెళ్లే అవకాశాన్ని కల్పిస్తారన్న ధీమాను ఆయన వ్యక్తం చేశారు.

ఎవరికి వారే గెలుపుపై ధీమా..

- కూడికలు తీసివేతలతో అభ్యర్థులు తలమునకలు
- ఓటింగ్ పూర్తికావడంతో మెజార్టీపై లెక్కలు
- భారీ ఓటింగ్‌తో తమకు కలిసివస్తుందంటున్న వైఎస్సార్ సీపీ

భీమవరం: ఓట్ల పండుగ ముగిసింది. ఇక మిగిలింగి కౌంటింగ్ జాతరే. అభ్యర్థులు తమ అనుచరులు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కూడికలు తీసివేతలతో తలమునకలై ఉన్నారు. సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ముగియడంతో ఆయా ప్రధాన పార్టీల అభ్యర్థులు ఎవరికి వారే ధీమా వ్యక్తం చేస్తున్నారు. తమ పార్టీకి ఎక్కడ ఓట్లు పడ్డాయి, ప్రత్యర్థి పార్టీ అభ్యర్థికి మైనస్‌లు ఏమిటీ మొత్తం మీద మెజార్టీ ఎంత వస్తుంది అనే లెక్కలేసుకుంటూ మళ్లగుల్లాలు పడుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 13వ తేదిన నిర్వహించిన సార్వత్రిక ఎన్నిక పోలింగ్ ఎంతో ఉత్సాహంగా సాగింది. మహిళలు, వృద్ధులు సైతం మండుటెండను సైతం లెక్కచేయకుండా మహిళలు, వృద్ధులు, వికలాంగులు కూడా పెద్ద సంఖ్యలో తరలివచ్చి గంటల కొద్ది పోలింగ్ బూత్‌ల వద్ద వేచిఉండి మరీ ఓట్లు వేశారు. జిల్లా వ్యాప్తంగా 7 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 82.60 శాతం పోలింగ్ నమోదైంది. సుమారు గత నెల రోజులకు పైగా వివిధ పార్టీల కార్యాలయాల వద్ద నాయకులు, కార్యకర్తలతో సందడిగా ఉండగా మంగళవారం ఆయా పార్టీ శిబిరాల వద్ద కొద్దిమంది నాయకులతో పోటీలో ఉన్న పార్టీల అభ్యర్థులు ఏ మండలం, ఏ ప్రాంతంలో ఎంత మెజార్టీ వస్తుందనే లెక్కలేసుకుంటున్నారు. మహిళలు, వృద్ధులు సైతం పెద్ద సంఖ్యలో ఓటు వేయడానికి తరలిరావడంతో అధికార వైఎస్సార్ సీపీ నాయకులు కుల, మత, రాజకీయ విభేదాలు లేకుండా అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందజేయడంతో తిరిగి వైఎస్సార్ సీపీని అధికారంలోనికి తీసుకురావాలనే లక్ష్యంతోనే ఓటర్లు తరలివచ్చారని చెబుతున్నారు. దీనితో గ్రామాల వారీగా పోలైన ఓటర్ల లిస్టులను తెప్పించుకుని ఏ గ్రామం ఎవరెవరు, తమకు ఓటు వేసి ఉంటారో అంచనాలు వేస్తున్నారు. గ్రామాలు, పట్టణంలోని వార్డుల్లోని స్థానిక నాయకులను దగ్గర కూర్చోబెట్టుకుని పోలింగ్ బూత్‌లు వారీగా పోలైన ఓట్లు ఏపార్టీకి ఎన్ని ఓట్లు పడి ఉంటాయనే అంచనాకు వస్తున్నారు. ఓట్లు తక్కువ రావచ్చునని అంచనా వేస్తున్న గ్రామాలు, వార్డుల్లో దానికి గల కారణాలను సైతం అన్వేషిస్తున్నారు. పోలింగ్ బూత్‌ల వద్ద ప్రత్యర్థి అభ్యర్థికి ఆపార్టీల నాయకులు, కార్యకర్తల నుంచి అందిన సహకారం ఎలా ఉందో కూడా తెలుసుకుంటున్నారు. జిల్లాలోని కొంత అభ్యర్థులు ఓటర్లుకు పంచడానికి ఇచ్చిన సొమ్ములు ఆయాపార్టీల నాయకులు, కార్యకర్తలు జేబులు నింపుకున్న వైనాన్ని సమీక్షిస్తున్నారు. లెక్కలన్నీ తేలితే రెండు, మూడు రోజుల్లోనే విజయం ఎవరిని వరిస్తోందో చెప్పగమని రాజకీయ పార్టీల నాయకులు చెబుతున్నారు.

వెనుదిరిగిన వలస ఓటర్లు



ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన ఓటర్లు తిరుగు ప్రయాణం చేస్తున్న దృశ్యం



నర్సాపురం నుంచి నాగర్‌సోల్ వెళ్లుతున్న ఎక్స్‌ప్రెస్ జనరల్ బోగీలో ప్రయాణికుల రద్దీ

ఆకివీడు: సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు దూర ప్రాంతాల నుంచి తెలంగాణా రాష్ట్రం నుంచి వచ్చిన ఓటర్లు సోమ, మంగళవారంలలో తిరుగు ప్రయాణం పట్టారు. ఓటు వేసిన అనంతరం సోమవారం రాత్రి హైదరాబాద్ వెళ్లే రైళ్లకు చాలామంది వలస ఓటర్లు వెళ్లిపోయారు. మంగళవారం ఉదయం నాగర్‌సోల్ ఎక్స్‌ప్రెస్‌కు, సాయంత్రం హైదరాబాద్ వెళ్లే పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు, పాసింజర్ రైళ్లకు తిరుగు ప్రయాణమయ్యారు. ఆయా ఎక్స్‌ప్రెస్ రైళ్లు, పాసింజర్ రైళ్లు ప్రయాణీకులతో కిక్కిరిసిపోయాయి. మూడు నెలలు ముందుగానే రిజర్వేషన్లు చేయించుకున్న ప్రయాణీకుల సీట్లను కూడా ఆక్రమించి వలస ఓటర్లు తమ ప్రయాణాన్ని కొనసాగించుకున్నారు. సాధారణ భోగిల్లో ప్రయాణించేందుకు వీలు లేకుండా అధిక సంఖ్యలో ప్రయాణీకులు, వలస ఓటర్లు ఎక్కడంతో కొంత మంది భోగీల గుమ్మాల వద్ద వేలాడాల్సి వచ్చింది. హైదరాబాద్ వరకూ రైళ్లన్నీ కిటకిటలాడాయని పలువురు ప్రయాణీకులు తెలిపారు.

వేసవి ప్రతాపం.. ప్రజల విలాపం



యలమంచిలి మండలం చించినాడ వద్ద నిర్మానుష్యంగా ఉన్న జాతీయ రహదారి



నిర్మాణుష్యంగా మారిన జాతీయ రహదారి

యలమంచిలి : వేసవి ఎండలు తీవ్ర ప్రతాపం చూపుతున్నాయి. ప్రజలు ఉదయం 10 దాటితే ఇళ్లలో నుంచి బయటకు రావాలంటే విలపిస్తున్నారు. వేసవి ఎండల తీవ్రత రోజురోజుకీ పెరుగుతుండటంతో పగలు, రాత్రి అనే తేడాలేకుండా ప్రజలు ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. సూర్య ప్రతాపానికి ఉదయం 11 దాటితే రోడ్లపై జనసంచారంలేక నిర్మానుష్యమవుతున్నాయి. సాయంత్రం ఐదు దాటిన తరువాత వాతావరణం కొంత చల్లపడడంతో ప్రజలు ఉపశమనం పొందుతున్నారు. అక్కడక్కడా చెదురుమదురుగా వర్షాలు పడుతున్నా పగటి ఉష్ణోగ్రతలు మాత్రం ఎక్కడా తగ్గడం లేదు. మధ్యాహ్న సమయంలో రోడ్లన్నీ కర్ఫ్యూని తలపిస్తున్నాయి. ప్రజలు తప్పనిసరి పరిస్థితుల్లో మాత్రమే ఇళ్లలో నుంచి బయటకు వస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే చించినాడ జాతీయ రహదారిపై కూడా అడపాదడపా మాత్రమే వాహనాలు తిరుగుతున్నాయి.

వ్యాపారాలు అంతత మాత్రమే

ఎండల తీవ్రత నేపథ్యంలో వ్యాపారాలు సరిగ్గా జరగడం లేదని వ్యాపారులు వాపోతున్నారు. ముఖ్యంగా ఎండాకాలంలో కూల్‌డ్రింక్స్ షాపులు, జ్యూస్ సెంటర్‌లకు మంచి గిరాకీ ఉంటుంది. అయితే ఎండల తీవ్రతకు మధ్యాహ్న సమయంలో ప్రజలు బయటకు రాకపోవడంతో బేరాలు ఉండడం లేదని మేడపాడుకు చెందిన కూల్‌డ్రింక్ షాప్ యజమాని ముద్దల సత్యనారాయణ తెలిపారు. జాతీయ రహదారి పక్కన బళ్లపై పళ్ల రసాలు అమ్మే చిరు వ్యాపారులు సైతం ఎండను లెక్కచేయకుండా రోడ్డు పక్కన నిల్చున్న బేరాలు రావడం లేదని వాపోతున్నారు.

మండుతున్న ఎండలు

మొగల్తూరు: గత కొద్ది రోజులుగా ఎండలు మండిపోతున్నాయి. ఉదయం 8 గంటలకే సూర్యుడు తన ప్రతాపం చూపడంతో ప్రజలు, వ్యవసాయ, ఉపాధి కూలీలు పనులు చేపట్టేందుకు ఇష్టపడటంలేదు. మంగళవారం ఉదయం నుంచే జాతీయ రహదారితో పాటు మొగల్తూరు గ్రామంలోని ప్రధాన రహదారులపై జన సంచారంలేక నిర్మాణుష్యంగా మారాయి. సోమవారం జరిగిన ఎన్నికల్లో సిబ్బంది, క్యూలైన్లలో ఉన్న ఓటర్లుకు తరుచుగా మంచి నీరు, స్నాక్స్ అందించడంతో వేడిగాలులు నుంచి ఉపశమనం పొందారు. రైతులు కూడా ముందుజాగ్రత్తగా తమ ధాన్యాన్ని జాతీయ రహదారిపై ఆరబెట్టుకుని ఒబ్బిడి చేసుకుంటున్నారు. రోహిణి కార్తె రాకమందే ఎండలు ఎక్కువగా కాసే అవకాశం ఉండొచ్చనే వాతావరణ శాఖ సమాచారంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

మేడపాడులో వెంకమ్మ జాతర ఉత్సవాలు



యలమంచిలి: మేడపాడు గ్రామ దేవత వెంకమ్మ జాతర ఉత్సవాలు సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్నారు. జాతర ఉత్సవాలలో భాగంగా ఈ నెల 10వ తేదీన అమ్మవారిని మంగళ వాయిద్యాల మధ్య పుట్టింటికి తీసుకొచ్చారు. అప్పటి నుంచి పుట్టింటి వద్ద పూరి గుడిసెలో అమ్మవారికి నిత్య నైవేద్యం సమర్పిస్తున్నారు. ఈ నెల 26వ తేదీన అమ్మవారికి జాతర నిర్వహిస్తారు. అనంతరం అమ్మవారు ఆలయ ప్రవేశం చేస్తారు. అప్పటి నుంచి ఐదు రోజులపాటు తీర్థ ఉత్సవాలు జరుగుతాయి. చివరి రోజున మాంసాహారంతో అన్నసమారాధన నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.

సూర్యనారాయణ స్వామికి ప్రత్యేక పూజలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరీ పంచాయతన క్షేత్రంలో వేంచేసియు న్న సూర్య నారాయణ స్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు, మూల విరాట్‌కు పంచామృతాలతో, సుగంధ ద్రవ్యాలతో, ఫలరాసాలతోను విశేష అభిషేకాలు జరిగాయి. ఆవరణలోని పరివార దేవతలకు పూజలు చేశారు. ప్రధాన పురోహితులు సత్యనారాయణ శర్మ, తరుణ్ శర్మలు బ్రహ్మ త్వం వహించారు. ఆర్యవైశ్య సంఘం సెక్రటరీ నున్న బాల త్రిపుర సుందరరావు, పేరూరి కాశయ్యలు పర్యవేక్షించారు.

గూడెంలో భారీ వర్షం

తాడేపల్లిగూడెం (టీఓసీ): గాలివాన బీభత్సానికి తాడేపల్లి గూడెం పలుచోట్ల వృక్షాలు నేలకు ఒరిగాయి. మంగళవారం సాయంత్రం సుమారు గంట సేపు సంభవించిన గాలివాన గ్రామస్తుల్ని తీవ్ర ఇబ్బందులకు గురిచేసింది. రోడ్లపైకి డ్రెయినేజీలోని నీరు ప్రవహించడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

స్ట్రాంగ్ రూంలకు పటిష్ట భద్రత



ఎస్ఆర్‌కేఆర్ కాలేజ్‌లో నియోజకవర్గ ఈవీఎంలు భద్రపరచిన స్ట్రాంగ్‌రూంకు సీల్ వేస్తున్న దృశ్యం

ఉండి: ఎన్నికలు ప్రశాంతంగా ముగియడంతో ఈవీఎంలను స్ట్రాంగ్ రూముకు చేర్చి మూడంచెల పటిష్ట భద్రతను ఏర్పాటు చేసినట్లు ఉండి ఆర్వో, జిల్లా జాయింట్ కలెక్టర్ సీవీ ప్రవీణ్ ఆదిత్య పత్రికా ప్రకటనలో మంగళవారం తెలిపారు. భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూంలలో ఉండి నియోజకవర్గానికి చెందిన ఈవీఎంలను జిల్లా ఎన్నికల అధికారి,జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, ఉండి, తణుకు, తాడేపల్లిగూడెం సాధారణ ఎన్నికల పరిశీలకుడు ఎల్ నిర్మల్‌రాజ్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఏజెంట్ల సమక్షంలో స్ట్రాంగ్‌రూంల సీలింగ్ ప్రక్రియను పూర్తి చేశామని ఆర్వో తెలిపారు. కౌంటింగ్ వరకు ఈవీఎంల భద్రత కోసం మూడంచల రక్షణ వలయాన్ని ఏర్పాటు చేశామన్నారు. కేంద్ర బలగాలతో పాటు రాష్ట్ర బలగాలు, సివిల్ పోలీసులు కూడా ఈవీఎంలకు షిఫ్టుల ప్రకారం 24 గంటలు భద్రతగా ఉంటారని అన్నారు. ఈవీఎంల భద్రత గురించి ఎవరికీ అనుమానాలు అవసరం లేదని అన్నారు. స్ట్రాంగ్ రూముల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులకు అవసరం అయితే సీసీ ఫుటేజ్ ఇవ్వడం జరుగుతుందన్నారు. పోటీ చేసిన అభ్యర్థులు ఎప్పుడైనా స్ట్రాంగ్ రూములను పరిశీలన చేయవచ్చునని అన్నారు. అందుకు తనను సంప్రదింస్తే చూటగానికి తగిన ఏర్పాట్లు చేస్తానని ఆర్వో ప్రవీణ్ ఆదిత్య తెలిపారు.

టెన్త్‌లో వెస్ట్‌బెర్రీ విద్యార్థుల అద్భుత ఫలితాలు



డి సంజయ్‌వర్మ



ఎస్‌కే ఆస్మా



బి జోషిత



ఎన్ సంజన



వి భవ్యశ్రీ

భీమవరం: భీమవరం పట్టణ సమీపంలోని పెదఅమిరం గ్రామంలోని వెస్ట్‌బెర్రీ స్కూల్ విద్యార్థులు సీబీఎస్‌ఈ టెన్త్, ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో అద్భుత ఫలితాలు సాధించారని స్కూల్ డైరెక్టర్ నడింపల్లి మహేష్‌కుమార్, ప్రిన్సిపల్ సారా స్మిత మంగళవారం విలేకర్లకు చెప్పారు. 2023–24 సంవత్సరంలో టెన్త్‌లో వి భవ్యశ్రీ 96 శాతం మార్కులు సాధించగా డి సంజయ్‌వర్మ 95.4 శాతం, ఎన్ సంజన 93 శాతం మార్కులు సాధించారన్నారు. తమ స్కూల్లోని నూటికి నూరు శాతం విద్యార్థులు ఉత్తీర్ణులు కాగా, నూటికి 90 శాతం మార్కులు సాధించిన విద్యార్థులు 29 శాతం, 75 శాతం మార్కులు సాధించిన విద్యార్థులు 75శాతం , 60 శాతం మార్కులు సాధించిన విద్యార్థులు 100 శాతం ఉన్నారన్నారు. ఇంటర్మీడియట్ బి జోషిత 84 శాతం, ఎస్‌కె అస్మా 83 శాతం మార్కులు సాధించగా నూటికి నూరు శాతం విద్యార్థులు ఉత్తీర్ణులు సాధించారని చెప్పారు. ఈ సందర్భంగా మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులను మహేష్ కుమార్, స్మిత అభినందించారు.

ముగిసిన కోవెల ఉత్సవాలు



ఆదికేశవ ఎంబెరుమానార్ స్వామివార్లకు పుష్కరిణిలో తెప్పోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: దాదాపు 23 రోజుల క్రితం ప్రారంభమైన శ్రీ ఆదికేశవ ఎంబెరుమానార్ స్వామివారి దేవస్థానం ఉత్సవాలు మంగళవారంతో ముగిశాయి. గత నెల 22వ తేదీన ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు మే నెల 2తో ముగిశాయి. అనంతరం 3వ తేదీ నుంచి మంగళవారం వరకు వార్షిక తిరునక్షత్ర ఉత్సవాలు నిర్వహించారు. మంగళవారం శ్రీభూదేవి సమేత ఆదికేశవస్వామివారికి, వడయవర్లకు మణవాళ మామునులకు అలంకార తిరుమంజనం, తీర్థప్రసాద గోష్టి చేశారు. సాయంత్రం 6 గంటలకు అగ్రహారోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం ఆదికేశవ, ఎంబెరు మానార్ స్వామివార్లను మాడవీధుల్లో ఊరేగించారు. హంస వాహనంతో తెప్పోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ స్థానాచార్యులు కె.వెంకటాచార్యులు, అధ్యాపకస్వామి ముడుంబై మోహన నర్సింహాచార్యులు, అర్చకులు సుదర్శనం శేషాచార్యులు, పెద్దింటి మోహన రామాచార్యులు, శ్రీనివాసుల జగన్నాథాచార్యులు, శ్రీనివాసుల రామకృష్ణ, తళిహాస్వామి ఏవీవీఆర్ రామానుజాచార్లు తదితరులను ఆలయ ఫౌండర్ ట్రస్టీ పుప్పాల ఆదినారాయణ, కార్యనిర్వహణాధికారి చాగంటి సురేష్‌నాయుడు ఘనంగా సత్కరించారు.

మాతా శిశు ఆరోగ్యానికి కిల్కారి సేవలు



కిల్కారీ వాయిస్ మెసేజ్ ద్వారా గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మాతా శిశు ఆరోగ్యం బలపరిచే దిశగా ఆరోగ్య శాఖ కిల్కారీ వాయిస్ మెసేజ్ ప్రవేశపెట్టడం జరిగిందని వెంకట్రామన్నగూడెం పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీహర్ష తెలిపారు. మంగళవారం మండలంలోని వెంకట్రామన్నగూడెం పీహెచ్‌సీలో ఆయన మాట్లాడారు. వాయిస్ మెసేజ్ ద్వారాప్రతీ వారానికి ఒకసారి వాయిస్ మెసేజ్ వస్తుందన్నారు. తద్వారా తల్లీ, బిడ్డ ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఒకవేళ వాయిస్ మెసేజ్ మిస్ అయితే 14423కి కాల్ చేసి మరలా వినవచ్చన్నారు. ఇప్పటికే ఈ వాయిస్ మెసేజ్‌పై ఆశా కార్యకర్తలకు శిక్షణ నివ్వడం జరిగిందన్నారు. వైద్యారోగ్య శాఖ ప్రవేశపెట్టిన ఈ వాయిస్ మెసేజ్‌కు మంచి స్పందన వస్తుందన్నారు. ఆరోగ్యవంతమైన స మాజం ఏర్పడటంతో కిల్కారీ వాయిస్ మెసేజ్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఇటువంటి కార్యక్రమాలు ప్రజల్లో చైతన్యవం తీసుకురావడానికి ఉపకరిస్తాయన్నారు.